



ఏలూరులో మంగళవారం అర్ధరాత్రి బుల్లెట్‌పై తనిఖీలు చేస్తున్న ఎస్పీ కిశోర్

అడుగడుగునా పోలీసులు

స్వయంగా రంగంలోకి ఎస్పీ

నగరంలో నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతం

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో నూతన సంవత్సరం వేడుకల్లో యువత ఎలాంటి అల్లర్లు కాని ఆకతాయి పనులకు కాని పాల్పడకుండా ముందస్తు చర్యలను పోలీస్ శాఖ చేపట్టింది. డిసెంబరు 31వ తేదీ రాత్రి 9 గంటల నుంచే జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రధాన కూడళ్లల్లో చెక్‌పోస్టుల వద్ద గస్తీలో ఉన్నారు. ముందుగానే స్టాపర్లతో రోడ్లను మూసివేసి వాహనాలు వెళ్ళేంత మార్గాన్ని మాత్రమే ఉంచారు. వాహనాలకు సైలెన్సర్లు తీసి ఎక్కువ శబ్దాలు చేసే వాహనదారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ కిశోర్ అర్ధరాత్రి అర్ధరాత్రి 2 గంటల వరకు బుల్లెట్ మోటారు సైకిల్‌పై స్వయంగా నగరంలో ప్రధాన రోడ్లపై తిరిగి చెక్‌పోస్టుల వద్ద ఉన్న పోలీసు బందోబస్తును, బీట్లలో ఉన్న పోలీస్ సిబ్బందిని తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎస్పీతో పాటు ఆయన వెనుక పోలీసు వాహనాలు సైరెన్లతో నగరంలో గస్తీ తిరగడంతో ఆకతాయిలు, అల్లరిమూకలు హడలిపోయి ఇళ్ళకు వెళ్ళిపోయారు. మొత్తం మీద ఏ చిన్న ఘటన జరుగకుండా నగరంలో నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరిగాయి. గతేడాది 31వ తేదీ అర్ధరాత్రి పాతబస్టాండ్ సమీపంలోని పూటుగా మద్యం తాగిన ఇద్దరు గొడవపడి కత్తితో ఒకరిని పొడవడంతో మృతి చెందాడు. అంతేకాకుండా అనేక మంది మద్యం తాగి రోడ్లపైనే హర్షణలకు దిగి తీవ్ర గాయాలపాలయ్యారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఎస్పీ నేరుగా రంగంలోకి దిగి నగరంలో పోలిసింగ్‌ను చూపించారు. అర్ధరాత్రి చర్చిలకు వెళ్ళి తిరిగి వచ్చే వారు ఎలాంటి భయం లేకుండా కాలినడకన, వాహనాలపై స్వేచ్ఛగా తమ ఇళ్ళకు చేరుకున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- కలెక్టర్ వెట్రిసెల్వి..
- బాలసదనం చిన్నారులతో నూతన సంవత్సర వేడుకలు

దెందులూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : 'చిన్నారులంతా బాగా చదివి ఉన్నత స్థానాల్లోకి వెళ్లాలి. చదువు మాత్రమే మంచి భవిష్యత్తు ఇస్తుంది. మీ గార్డియన్‌గా మీ సమస్యలను పరిష్కరిస్తా'నని కలెక్టర్ వెట్రిసెల్వి దెందులూరులోని బాలసదనం చిన్నారులకు భరోసా ఇచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కలెక్టర్ మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దెందులూరు బాలసదనంలోని చిన్నారులతో సరదాగా గడిపారు. బాలసదనంలోని జె.సిరి, గోపిక పుట్టినరోజు సందర్భంగా కలెక్టర్ స్వయంగా కేక్ కట్ చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కానుకలను అందించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఐదో తరగతి చదువుతున్న ఎస్.హారిక అనే చిన్నారితో అరగంట పాటు చెస్ ఆడారు. విజేతగా నిలిచిన హారికను కలెక్టర్ అభినందించారు. అనంతరం చిన్నారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. సంక్రాంతి పండుగను అందరూ కలిసి మా ఇంట్లో చేసుకుందామని చిన్నారులకు తెలిపి అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. విద్యార్థులతో గ్రూప్ ఫొటో దిగారు. ఆమె వెంట పీడీ శారద, డీసీపీవో సూర్యచక్రవేణి, తహసీల్దార్ సుమతి, బాలసదనం సూపరింటెండెంట్ బేబి సరోజిని, తదితరులు ఉన్నారు.



చిన్నారితో చెస్ ఆడుతూ..



చిన్నారులు సిరి, గోపికల పుట్టినరోజు సందర్భంగా కేక్ తినిపిస్తున్న కలెక్టర్



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న మంత్రి సారథి

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోని అన్న క్యాంటీన్‌ను బుధవారం మంత్రి సందర్శించి అక్కడివారితో కలిసి భోజనం చేశారు. పేదలకు ఆయన స్వయంగా భోజనాలను వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెలుగుదేశం పార్టీ హయాంలో అన్న క్యాంటీన్‌లను ఏర్పాటుచేసి రూ.5లకే నిరుపేదలకు భోజనాలు అందించగా, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దుచేసి పేదల కడుపు కొట్టిందన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ తన మానసపుత్రికగా అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించారన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు రాము, ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చింతలపూడిలో ఒకప్పటి ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయమిది.. ప్రస్తుతం ఈ కార్యాలయం జంగారెడ్డిగూడెం తరలిపోయింది.

తరలించిన కార్యాలయాలు.. తిరిగొస్తాయా?

- చింతలపూడి నుంచి తరలిపోయిన కార్యాలయాలు
- వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలు
- అవస్థలు పడుతున్న స్థానికులు

చింతలపూడి, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండడానికి మండల శాఖలు వచ్చాయి. నియోజకవర్గ కేంద్రాల్లో సబ్ డివిజన్లు ఏర్పాటు చేశారు. పరిపాలన, అభివృద్ధి, వికేంద్రీ కరణతో ఈ ప్రాంతాలలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు ఈ విధానంలో కలిగాయి. తద్వారా అభివృద్ధి జరిగింది. కాని చింతలపూడి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సబ్ డివిజన్లను చిన్నాభిన్నం చేసి గత ప్రభుత్వంలో ఇతర డివిజన్లకు తరలించడం వల్ల ఉపయోగం ఏమిటో తెలియదుకాని ప్రజలు ఆ శాఖల పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. అధికారులు, ఎమ్మెల్యేలు సమీక్షలు నిర్వహించాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్కిల్ కార్యాలయాల పరిధిలోని మండలాలు రెండు నియోజక వర్గాల్లో ఉండడం వల్ల ఇద్దరు ఎమ్మెల్యేల సమీక్షలకు అధికారులు వెళ్ళాల్సి ఉంటుంది. ఈ తరహా పరిపాలన వల్ల ఆయా శాఖల అధికారులు సమీక్షా సమావేశానికి హాజరు కాలేకపోతున్నారు. చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో 30 మండల శాఖ కార్యాలయాలు, 14 సబ్ డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి.

2009లో రిజర్వు డు నియోజకవర్గంగా మారింది. అప్పుడు యథావిధిగానే కొనసాగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో సబ్ డివిజన్ కార్యాలయాలు ఎత్తివేసి ఇతర రెవెన్యూ డివిజన్లలో కలిపారు. ఇవి కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడంతో తాగునీటి కోసం గ్రామీణ నీటి సరఫరా విభాగం సబ్ డివిజన్ కార్యాలయాన్ని జనరల్‌గా ఉన్నప్పుడే ఏర్పాటు చేశారు. ఇప్పుడు సబ్ డివిజన్‌ను జంగారెడ్డిగూడెంకు తరలించారు. ఆ శాఖ అధికారులు, సిబ్బంది అసౌకర్యంగా ఉంటుందని ఆందోళన జరిపారు. గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌ను నూజివీడుకు తరలించారు. చింతలపూడి, లింగపాలెం రెవెన్యూ మండలాలను నూజివీడు రెవెన్యూ డివిజన్‌లో కలిపారు. అయితే దీనివల్ల దూరమవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. పోలీస్ సర్కిల్‌ను రెండు మండలాలకు కుదించారు. ఎక్సైజ్ సర్కిల్, వ్యవసాయ శాఖ, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, ఐసీడీఎస్, సహాయ సాంఘిక సంక్షేమశాఖ, కార్మికశాఖ రెండు నియోజక వర్గాల పరిధిలో ఉన్నాయి. ఇక చింతలపూడి వెలుగు ఏరియా కార్యాలయం పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాలు మూడు నియోజక వర్గాల పరిధిలో ఉన్నాయి. ఈ విధంగా కార్యాలయాలు అస్తవ్యస్తంగా మారడం వల్ల ఇబ్బంది ఎదురవుతోంది. గతంలో విద్యుత్ రెవెన్యూ కార్యాలయం ఏలూరులో ఉండేది. రూ.50 బిల్లు చెల్లించాలన్నా 60 కిలోమీటర్లు ఏలూరు వెళ్ళాల్సి వచ్చేది. ప్రజల పోరుతో ఏడీ కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. కాని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని జంగా రెడ్డిగూడెంలో ఏర్పాటు చేశారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, తాగునీరు, రెవెన్యూ, గృహ నిర్మాణం వంటి అవసరాలు ఉన్న కార్యాలయాలు తరలి పోవడంతో లబ్ధిదారులు, ప్రజలకు ఏ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. ఇప్పుడు డిజిటల్ ఆన్‌లైన్ విధానం వచ్చినా ప్రాంతాలు అభివృద్ధి జరగాలంటే ఉన్న కార్యాలయం తరలించకుండా అదనపు కార్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రజలకు అందుబాటులో పరిపాలన కార్యాలయాలు ఉండాలని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తరలించిన కార్యాలయాలను తిరిగి తెప్పించడానికి కృషి చేస్తున్నట్టు సమాచారం.

> **కార్యాలయాల తరలింపుతో ప్రజలకు భారం**
>
> 
>
> నియోజకవర్గ కేంద్రంలో ఉండాల్సిన కార్యాలయాలు అందుబాటులో ఉంటేనే ఉపయోగం. తరలిస్తే ప్రజలకు భారం. కార్యాలయ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పవు. సబ్ డివిజన్ విధానాన్ని పునరుద్ధరిస్తే బాగుంటుంది.
>
> - పిడపర్తి ముత్తారెడ్డి, యర్రగుంటపల్లి



కుక్కునూరులో అమ్మకానికి కల్లంలో సిద్ధంగా ఉన్న మిర్చి

మిర్చి రైతు దిగాలు!

ఆశాజనకంగా దిగుబడులు.. గిట్టుబాటు కాని ధరలు

క్వింటా రూ.12 వేల నుంచి రూ.13 వేలు

ముందుకు రాని వ్యాపారులు.. రైతుల ఆవేదన

కుక్కునూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నల్లరేగడి భూముల్లో పండే మిర్చికి ఒకప్పుడు ఎంతో డిమాండ్ ఉండేది. రైతులు లాభాలు ఆర్జించేవారు. కానీ మిర్చి రైతు పరిస్థితి గత కొన్నేళ్ళుగా తారుమారైంది. గత మూడేళ్ళుగా దిగుబడులతో పాటు ఆశించిన ధర లేక పెట్టిన పెట్టుబడి రాక మిర్చి రైతాంగం అప్పుల పాలయ్యారు. ఈ ఏడాది ఎన్నో ఆశలతో రైతాంగం మిర్చి సాగును ఆరంభించారు. మూడేళ్ళుగా నల్లీ, వైరస్ ప్రభావంతో మిర్చిసాగులో ఆశించిన దిగుబడి రాలేదు. ఈ ఏడాది కూడా నల్లి ప్రభావం ఉంది. దీనిని నివారించడానికి రైతులు అధికంగా మందులు పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి కౌలు, పెట్టుబడికి రెండున్నర లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఖర్చయ్యింది. దిగుబడులు గతేడాదితో పోలిస్తే కాస్తా బాగున్నా ధర ఆశాజనకంగా లేదు. రెండేళ్ల క్రితం క్వింటా మిర్చి రూ.20 వేలు నుంచి రూ.23 వేల వరకు పలికింది. గతేడాది రూ.12 వేల నుంచి 13 వేలు మాత్రమే ఉంది. ఈ ఏడాది ఎకరానికి 20 - 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కానీ ఆశించిన స్థాయిలో ధర లేదు. క్వింటా రూ.12 వేల నుంచి రూ.13 వేలు ధర పలుకుతోంది. కానీ వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదు. ఈ ఏడాది కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో దాదాపు ఆరు వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గతంలో 15 వేల ఎకరాలకు పైగానే సాగు చేసేవారు. కానీ ఏటా వైరస్, నల్లి ప్రభావం, పెరిగిన కౌలు ధరలు , పెట్టుబడులు, దిగుబడులు లేకపోవడం, నష్టాలను చవిచూడటంతో రైతులు మిర్చి సాగుకు దూరమవుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే కోతలు ఆరంభించి కల్లాల్లో మిర్చిని ఆరబోస్తున్నారు. మిర్చి అమ్మకాలు చేద్దామన్న వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులకు ఏమి పాలు పోవడంలేదు. ప్రభుత్వం కల్పించుకుని మిర్చికి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని మిర్చి రైతులు కోరుతున్నారు.



కుక్కునూరులో సాగవుతున్న మిర్చి పంట

'ఓపెన్' టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజుల చెల్లింపునకు గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్ అభ్యాసకులకు మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ఫీజులు చెల్లించే గడువు పొడిగించినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 6వ తేదీ వరకు, ఒక్కో సబ్జెక్టుకు అపరాధ రుసుం రూ.25లతో కలిపి 8వ తేదీ వరకు, పెనాల్టీ రూ.50తో 9వ తేదీ, తత్కాల్ స్కీంలో పదో తరగతికి రూ.500, ఇంటర్మీడియట్‌కు రూ.1000 అపరాధ రుసుంతో 10వ తేదీ వరకు ఫీజును ఏపీ ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు గడువు ఉందన్నారు. ఇంటర్‌లో థియరీ సబ్జెక్టు ఒక్కింటికి రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టు ఒక్కింటికి రూ.100, పదో తరగతి సబ్జెక్టు ఒక్కింటికి రూ.100 చొప్పున పరీక్ష ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏమైనా సందేహాలుంటే ఓపెన్ స్కూల్ అధీకృత స్టడీసెంటర్లలో, డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



రైళ్లన్నీ కుంభమేళా వైపు!
సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు లేనట్లే?
ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ
రమణీయం.. ధనుర్మాస ఉత్సవం
హిమ సోయగం 7



విద్యుత్ తీగలే.. పానుపుగా!

పాలకొండ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూస్తే కరెంటు తీగలపై ఓ వ్యక్తి చనిపోయినట్టు ఉంది కదూ..! అయితే అతను చనిపోలేదు.. కరెంటు తీగలపై పడుకున్నాడంతే.. అసలేం జరిగిందంటే.. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం ఎం.సింగుపురంలో యజ్జల వెంకన్న అనే యువకుడు డిసెంబరు 31 రాత్రి ఫుల్లుగా మందు తాగి, గ్రామస్థులను హడలెత్తించాడు. వీధుల్లో కనిపించినవారిని ఇష్టమొచ్చినట్టు మాట్లాడాడు. వీధిలో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కేందుకు ప్రయత్నించాడు. దీంతో స్థానికులు ఏబీ స్విచ్‌ను ఆపేసి విద్యుత్ సరఫరా నిలిపేశారు. అయినా.. ఆ యువకుడు ఓ డాబాపై ఎక్కి, అక్కడి నుంచి విద్యుత్ స్తంభం మీదకు చేరాడు. విద్యుత్ తీగలపై విన్యాసాలు చేస్తూ, అక్కడే పడుకున్నాడు. స్థానికులు వెంకన్నను వారించి కిందకు దించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆతర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

200 కోట్లు తాగేశారు!

(మొదటి పేజీ తరువాయి)

ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఒక్కరోజులోనే మద్యం విక్రయాలు జరిగాయి. న్యూఇయర్ ట్రెండ్ బుధవారం కూడా కొనసాగింది. నూతన సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం షాపులు, బార్ల లైసెన్సీలు ముందుగానే పెద్దమొత్తంలో మద్యం కొనుగోలు చేశారు. డిసెంబరు 26 నుంచి మూడు రోజులపాటు రోజుకు రూ.130 కోట్ల మద్యం డిపోల (గోడౌన్ల) నుంచి దిగుమతి చేసుకున్నారు. ఆదివారం సెలవు మినహాయిస్తే 30న ఏకంగా రూ.219.43 కోట్ల విలువైన మద్యం కొనుగోలు చేశారు. 31న రూ.112.42 కోట్ల మద్యం కొన్నారు. ఈ రెండు రోజుల్లోనే లైసెన్సీలు ప్రభుత్వం నుంచి 4.08లక్షల కేసుల లిక్కర్, 1.61లక్షల కేసుల బీరు తీసుకున్నారు. ఇందులో 31వ తేదీన 2.5లక్షల కేసుల లిక్కర్, 70వేల కేసుల బీరు అమ్మినట్లు అంచనా. పక్క రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్, రాష్ట్రంలో నాటుసారాపై నియంత్రణ చర్యలు చేపట్టడం కూడా మద్యం అమ్మకాలు పెరగడానికి కారణమయ్యాయి. గతంలో మంచి బ్రాండ్లు దొరకడం లేదని, ధర తక్కువకు వస్తుందని తెలంగాణ, కర్ణాటక నుంచి నూతన సంవత్సర వేడుకలకు భారీగా ఎన్‌డీపీఎల్ తీసుకొచ్చేవారు. కొత్త మద్యం పాలసీలో ధరలు తగ్గడం వల్ల ఎన్‌డీపీఎల్ ప్రభావం కొంతమేర తగ్గింది. ఎక్సైజ్ శాఖ 24గంటల తనిఖీలు చేపట్టడంతో గత రెండు రోజుల్లో ఎన్‌డీపీఎల్ ఇంకా తగ్గింది. ఫలితంగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెరిగాయి.

'పుష్ప' నిర్మాతలను
అరెస్టు చేయొద్దు

- తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన కేసులో సదరు చిత్ర నిర్మాతలను అరెస్టు చెయ్యవద్దని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసుతో తమకు సంబంధం లేదని, చిక్కడపల్లి పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని ఆదేశించమని కోరుతూ పుష్ప నిర్మాణ సంస్థ.. మైత్రీ మూవీస్ యజమానులు యలమంచిలి రవిశంకర్, యెర్నేని నవీన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ కే సుజన ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. తాము అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ సంధ్య థియేటర్ వద్ద దురదృష్టకర ఘటన జరుగుతుందని తాము ఊహించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి విన్నవించారు. అలాంటి ఘటన జరగాలనే ఉద్దేశం తమకు లేదని, ఘటన జరగడానికి తాము కారకులం కాదని పేర్కొన్నారు. ఆ నేరాన్ని తమకు ఆపాదించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రీమియర్ షో ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రభుత్వ అనుమతి కూడా పొందామని తెలిపారు. సినిమా నిర్మాణం వరకే తాము పరిమితమయ్యామని, జరిగిన ఘటనకు తమకు ఎలాంటి సంబంధం లేదని వివరించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్లను అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులు, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఎండీసీకి మస్కా

భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలు మింగేశారు

- కానీ, ఎండీసీకి పైసా వాటా ఇవ్వని కడప నేత కంపెనీ
- బెరైటీస్ బెనిఫిసియేషన్‌లో గోల్‌మాల్
- కడప నాయకుడి చీకటి మంత్రాంగం
- ఎండీసీతో 2008లో జాయింట్ వెంచర్
- కానీ, సొంతంగా వ్యాపారం
- 16 ఏళ్లుగా 11 శాతం వాటా ఇవ్వని కంపెనీ
- మరో కంపెనీని ఏర్పాటుచేసి వ్యాపారం
- కాగ్ తప్పుపట్టినా మొద్దునిద్రలో గనులశాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బెరైటీస్ దందాలో ఇదో కొత్త కోణం. జాయింట్ వెంచర్ పేరిట సాగుతున్న నయా దోపిడి. ప్రభుత్వ సంస్థను భాగస్వామిగా చేసుకోవడం ద్వారా వచ్చే ప్రత్యేక రాయితీలు, ప్రయోజనాలు పొందుతూ, తిరిగి రూపాయి ఇవ్వకుండా నిలువునా ముంచేస్తున్న దందా ఇది. ఈ విషయాన్ని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గుర్తించి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. బెరైటీస్ బెనిఫిసియేషన్‌లో చీకటి దందా సాగుతోందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. అయినా గనులశాఖ ఏ చర్యలూ తీసుకోలేదు. ఎందుకంటే ఆయన నాటి గనుల మంత్రికి సన్నిహితుడు. కడప జిల్లా వైసీపీ నేత. జగన్ జమానాలో సహజ వనరుల దోపిడికి పాల్పడిన అనేకమందిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కానీ, ఈ కడప నేత దోపిడి గురించి తెలిసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వాన్ని నిలువునా ముంచుతున్న ఈ నేత వ్యవహారం తెలిసినా అధికారులు మౌనంగా ఉంటున్నారు. ఇందుకు కారణం ఏమయి ఉంటుంది? వివరాల్లోకి వెళితే..కడప జిల్లాకు చెందిన వైసీపీ నేత ఒకరు బెరైటీస్ వ్యాపారం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థతో (ఏపీఎండీసీ) ఉమ్మడి భాగస్వామి గా (జాయింట్ వెంచర్) 2008లో ప్లాంటు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ నేత ప్లాంట్‌లో ఎండీసీకి 11 శాతం వాటా ఉంది. జాయింట్ వెంచర్ వల్ల ఎండీసీ ఆ కంపెనీకి తక్కువ ధరకే బెరైటీస్‌ను సరఫరా చేస్తోంది. ఇంకా ఇతర సబ్సిడీలు ఆ కంపెనీకి దక్కుతున్నాయి. బెరైటీస్ సరఫరాలో ఈ కంపెనీకి ప్రాధాన్యత కూడా ఉంది. నిబంధనల ప్రకారం ఏటా నిర్దేశించిన వాటా డబ్బు ఎండీసీకి ఆ నేత కంపెనీ జమచేయాలి. కానీ, కంపెనీ ఏర్పాటయిన 2008 నుంచి నేటివరకు ఎండీసీకి వాటా సొమ్ము రూపాయి కూడా రాలేదు. కానీ, ఏటేటా ఆ కంపెనీకి ఎండీసీ నుంచి సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు ఠంచనుగా వెళ్తున్నాయి. ప్రతి నెల సగటున 5-10వేల టన్నుల బెరైటీస్‌ను ఆ ప్లాంటులో బెనిఫిసియేషన్ చేస్తున్నారు.

చీకటి వ్యాపారం

కాగ్ నివేదిక తర్వాత కడప నేత రూటు మార్చారు. సొంతంగా మరో మినరల్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఈ కంపెనీ పేరిట నేరుగా మిల్లుల నుంచి బెరైటీస్ కొనుగోలు చేస్తున్నారు. వాటి ఎండీసీతో భాగస్వామ్యం ఉన్న కంపెనీలో బెనిఫిసియేషన్ చేస్తున్నారు. దీనివల్ల ఎండీసీకి 11 శాతం వాటా ఇవ్వాల్సిన అవసరం లేదన్నది ఆయన వాదన. కానీ, జాయింట్ వెంచర్ ఒప్పందం ప్రకారం, ఆ ప్లాంటు ద్వారా జరిగే ప్రతీ వ్యాపారంలో ఎండీసీకి వాటా ఇచ్చితీరాల్సిందే. ఈ చీకటి వ్యాపారం గురించి గనులశాఖ అధికారులకు తెలిసినా మిన్నకుండిపోయారు. ప్రభుత్వ సంస్థను నిలువునా ముంచేస్తున్నా గనుల శాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదు? కూటమి ప్రభుత్వంలో కూడా ఆ నేత కంపెనీకి ఎందుకు నోటీసులు ఇవ్వలేకపోతున్నారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కాగ్ ప్రశ్నలతో కదలిక

ఎండీసీ ప్రాజెక్టులు, ఆదాయ వ్యయాలు, అప్పులపై జగన్ ప్రభుత్వంలో కాగ్ పరిశీలన చేసినప్పుడు...కీలక విషయాలు వెలుగుచూశాయి. జాయింట్ వెంచర్ వ్యాపారంలో 11 శాతం వాటాగా ఎండీసీకి ఎంత డబ్బు జమ అవుతోంది? గత 16 ఏళ్లలో ఇప్పటిదాకా వచ్చిన మొత్తం ఆదాయం ఎంత? ప్రయోజనాలు, సబ్సిడీల రూపంలో ఆ కంపెనీకి ఎండీసీ ఇచ్చినదెంత? అన్న కీలక ప్రశ్నలపై కాగ్ పరిశీలన జరిపింది. పేరుకే జాయింట్ వెంచర్ ఒప్పందం జరిగిందని, ఇప్పటివరకు ఎండీసీకి 11 శాతం వాటా కింద రూపాయి దక్కలేదని కాగ్ తేల్చింది. అయితే, వాటా సొమ్ము ఇవ్వని అంశాన్ని ఇప్పటి వరకు బోర్డు సమావేశంలో ఎందుకు చర్చించలేదు? ఆ సంస్థకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదు? ఇప్పటి వరకు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని ఎందుకు సమీక్షించలేదు? అని కాగ్ ప్రశ్నలు సంధించింది. గనుల శాఖ వద్ద దీనిపై ఒక్క సమాధానమూ లేదు. ఆ కంపెనీ యజమాని వైసీపీ నేత అని, నాటి గనుల మంత్రికి అత్యంత సన్నిహితుడన్న సమాచారం తప్ప మరే వివరణ అధికారులు ఇవ్వలేదు. నాటి మంత్రికి సన్నిహితుడనే కారణంతో అధికారులు ఆ కంపెనీకి ఎలాంటి నోటీసు ఇవ్వలేకపోయారన్నది స్పష్టమవుతోంది.

ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదు?

జగన్ జమానాలో గనులశాఖ కేంద్రంగా సాగిన దందాలపై కాగ్ దృష్టి సారించింది. ఇసుక, క్వార్ట్జ్, ఇతర ఖనిజాల దోపిడిపై విచారణ చేస్తోంది. గతంలో జరిగిన తప్పులను నివేదించడంతోపాటు వాటికి పరిష్కారాలు కోరుతోంది. కానీ గనుల శాఖ ఈ విషయాన్ని దాచిపెట్టింది. జాయింట్ వెంచర్ కంపెనీ ఏర్పాటు చేసిన నేత 16 ఏళ్లుగా వాటా సొమ్ము ఇవ్వడం లేదన్న అంశాన్నే సర్కారుకు నివేదించలేదు. దీంతో ఈ విషయం ప్రభుత్వ పరిశీలనకు రాకుండాపోయింది. అధికారులు ఈ విషయాన్ని అంత తీవ్రమైనదిగా తీసుకోకపోవడానికి ప్రధాన కారణం ఏమై ఉంటుంది?



ఏపీజేఏసీ అమరావతి డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, ఆ సంఘం నేతలు

పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించండి

- సీఎంకు ఏపీఎన్‌జీజీవో, ఏపీజేఏసీ అమరావతి నేతల విజ్ఞప్తి



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మాట్లాడుతున్న ఏపీఎన్‌జీజీవో నేతలు శివారెడ్డి, విద్యాసాగర్

విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో కూటమి ప్రభుత్వం నూతన ఉత్సాహాన్ని, ఆశలను నింపిందని ఏపీ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఉద్యోగుల సంఘం(ఏపీఎన్‌జీజీవో) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శివారెడ్డి, ఎ. విద్యాసాగర్‌లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర కార్యవర్గం చంద్రబాబును కలిసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన సాగర్‌ను చంద్రబాబు అభినందించారు. ఆ తర్వాత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఉద్యోగుల పెండింగ్ డీఏలతో పాటు జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండ్ లీవ్ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ ఉద్యోగుల పదవీ విరమణ వయసును కూడా 60 నుంచి 62 ఏళ్లకు పొడిగించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 2004, సెప్టెంబరు 1కి ముందు నోటిఫికేషన్ మేరకు నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో ఏపీఎన్‌జీజీవో నాయకులు కేఎస్ఎస్ ప్రసాద్, ఎన్. వెంకటేశ్వర్లు, సీహెచ్ మంజుల, అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

పలు డైరీల ఆవిష్కరణ


ఏపీజేఏసీ అమరావతి భాగస్వామ్య సంఘాలైన రెవెన్యూ, కో ఆపరేటివ్, ఆర్టీసీ, రిటైర్డ్ హెడ్మాస్టర్ల సంఘాల డైరీలను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని వివిధ భాగస్వామ్య సంఘాల నేతలు బుధవారం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రికి అందజేశారు. 11వ పీఆర్సీలో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, 12వ పీఆర్సీ కమిషనర్‌ను వీలైనంత త్వరగా నియమించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో టీవీ ఫణి పేర్రాజు, దామోదరరావు, కె. సంగీతరావు, పీవీ రమణ, జనకుల శ్రీనివాసరావు, వీవీ మురళీకృష్ణ నాయుడు, నాగరాజు, పాలె లక్ష్మీ, పొన్నూరు విజయలక్ష్మి తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఏపీపీటీడీ ఎన్ఎంయూ సంఘం క్యాలండర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. బుధవారం ఏపీపీటీడీ అగ్రనేతలు వీవీ రమణారెడ్డి, కోశాధికారి పీవీవీ మోహన్‌లు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

పాత పింఛను ఇవ్వండి: సీపీఎస్‌ఈఏ

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులలో భరోసా నింపేలా పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావులు బుధవారం ఓ ప్రకటనలో ముఖ్యమంత్రిని కోరారు. గత పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల హెల్త్‌కార్డు కంటే కూడా ఆరోగ్య శ్రీ కార్డులు బాగా పనిచేస్తున్నాయని, తక్షణం నగదు రహిత హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు.


చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నేడే షూటింగ్ ప్రారంభం




మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శక దిగ్గజం ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వర్కింగ్ టైటిల్ 'ఎస్ఎస్ఎమ్‌బీ29'. దుర్గాఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందా అని సినీ అభిమానులంతా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు వారి నిరీక్షణకు తెరపడేలా ఉంది. నేడే ఈ సినిమాను హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభించనున్నట్లు తెలిసింది. కాగా, ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు టాక్. దాదాపు రూ.వెయ్యి కోట్లతో రెండు భాగాలుగా తెరకెక్కించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రాని ఎంపిక చేసినట్లు వార్తలొచ్చాయి. మొదటి భాగాన్ని 2027లో.. రెండవ భాగాన్ని 2029లో విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.


కేన్సర్ నుంచి కోలుకున్నా..



కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ తన ఆరోగ్యం గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం అమెరికాలో చికిత్స తీసుకుంటున్న ఆయన.. కేన్సర్ నుంచి కోలుకున్నట్లు ఓ వీడియో విడుదల చేశారు. "కేన్సర్ సోకిందని తెలిస్తే ఎవరికైనా భయం సహజం. ఆ భయం నా నుంచి దూరం చేసేందుకు నా భార్య గీత, అభిమానులు అందించిన సహకారం మరువలేనిది. వారందరికీ రుణపడి ఉంటాను. చేతిలో ఉన్న సినిమాలు పూర్తిచేయడానికి చాలా కష్టపడ్డాను. ఓ వైపు కీమోథెరపీ చేయించుకుంటూనే '45' సినిమా షూటింగ్‌ను పూర్తి చేశాను. నా ఆరోగ్యం విషయంలో వైద్యులు అందించిన సహకారం మరువలేనిది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. శివన్న భార్య గీత మాట్లాడుతూ "నా భర్త కేన్సర్‌ను జయించడం ఎంతో సంతోషాన్నిస్తోంది. ఆయన్ని అభిమానించే వారందరికీ ఇది తీపి కబురులాంటిది. త్వరలోనే కర్ణాటకకు తిరిగి వస్తాం" అని అన్నారు.



న్యూ ఇయర్.. న్యూ లుక్స్!



కొత్త సంవత్సరం ఆరంభమైంది. తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త ఆశలు, అంచనాలు కూడా మొదలయ్యాయి. ఇక సంవత్సరం తొలి రోజున కొత్త పోస్టర్లు, కొత్త లుక్స్ సందడి చేశాయి. చాలా రోజుల తర్వాత మళ్లీ పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' చిత్రం కోసం 'మాట వినాలి' అంటూ ఓ పాట పాడారు. ఈ పాటను ఈ నెల 6న విడుదల చేస్తామంటూ చిత్ర నిర్మాణ సంస్థ ప్రత్యేక పోస్టర్ విడుదల చేసింది. అలాగే 'గేమ్ ఛేంజర్' సినిమాలో రామ్‌చరణ్, కియారా ఉన్న కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. రామ్ పోతినేని, భాగ్యశ్రీ కలసి నటిస్తున్న చిత్రంలోని హీరో హీరోయిన్ల ఫస్ట్ లుక్‌ను మైత్రీ మూవీస్ రిలీజ్ చేసింది. అలాగే నితిన్ నటిస్తున్న 'రాబిన్‌హుడ్', నాని నటిస్తున్న 'హిట్ 3', సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న 'జాక్' సినిమాల కొత్త స్టిల్స్ విడుదలయ్యాయి.









కీరవాణి గీతం.. ఇళయరాజా సంగీతం



రూపేష్ హీరోగా, రాజేంద్రప్రసాద్, అర్చన జంటగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'షష్టిపూర్తి'. ఇందులో ఆకాంక్ష సింగ్ కథానాయిక. ఈ సినిమా కోసం సంగీత దర్శకుడు కీరవాణి 'ఏదో ఏ జన్మలోదో ఈ పరిచయం' అంటూ ఓ పాటను రాయడం ఒక విశేషమైతే, ఇళయరాజా ఈ పాటకు స్వరపరచడం మరో విశేషం. ఇప్పటివరకూ 60కి పైగా పాటలను కీరవాణి రాసినా, ఇళయరాజా బాణీకి ఆయన పాట రాయడం ఇదే ప్రథమమని చిత్ర దర్శకుడు పవన్ ప్రభ చెప్పారు. చిత్రం షూటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని, త్వరలో సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాత రూపేశ్ చౌదరి చెప్పారు.

ఆసక్తి రేకెత్తించేలా...



రాజ్‌తరుణ్, రాశి సింగ్ నటిస్తున్న చిత్రం 'పాంచ్ మినార్'. బ్రహ్మాజీ, అజయ్ ఘోష్, శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ కడుముల దర్శకత్వంలో మాధవి, ఎమ్.ఎస్.ఎమ్.రెడ్డి నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. కార్ టాప్‌పై రిలాక్స్ అవుతున్నట్లు ఉన్న రాజ్‌తరుణ్ ట్రెండీ లుక్.. సూట్ కేస్‌లోని డబ్బులు గాల్లోకి ఎగరడం సినిమాపై ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నాయి.

గాంధీ బాటలో నడిచే బాలిక కథ



దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి తనయురాలు సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ సతీమణి సబితా సమర్పకురాలిగా నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, శేష సింధూరావు నిర్మించారు. ఈ నెల 24న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకురాలు పద్మావతి మాట్లాడుతూ "గాంధీ సిద్ధాంతాల్ని ఆదర్శంగా తీసుకుని.. ఆయన బాటలో నడిచే ఓ పదమూడేళ్ల బాలిక కథ ఈ చిత్రం. తన పుట్టిన ఊరిని కాపాడుకోవడం కోసం ఈ బాలిక ఏం చేసిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ సందేశాత్మక చిత్రం అందరి హృదయాలను కదిలిస్తుంది" అని చెప్పారు. కాగా, ఈ సినిమా ఇప్పటికే పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో పురస్కారాలు కైవసం చేసుకుంది. అలాగే, బాల నటిగా సుకృతి వేణి అవార్డు దక్కించుకోవడం విశేషం.

తెరపైకి ఒగ్గు కళ



తెలంగాణ జానపద కళా రూపం ఒగ్గు కళాకారుల జీవితాలు, వారి సంస్కృతి నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, బలగం జయరాం, కొమరక్క, బన్నీ ప్రధాన తారాగణం. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేశ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయిందని, ఈనెల చివరి వారంలో 'బ్రహ్మాండ' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి



రైళ్లన్నీ కుంభమేళా వైపు!

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు లేనట్లే.?

నరసాపురం/ఏలూరు క్రైం, జనవరి1(ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా నడిచే రైళ్ల టిక్కెట్లు నెలల క్రితమే బుక్ అయ్యాయి. సంక్రాంతి రద్దీతో స్లీపర్ నుంచి ఏసీ వరకు టిక్కెట్ల బుకింగ్‌తో వెయిటింగ్‌లిస్టు వంద వరకు వెళ్లింది. దీంతో ప్రయాణికులు స్పెషల్ రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 10 నుంచి ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వే పెద్ద సంఖ్యలో రైళ్లను నడపనుంది. ఇప్పటికే నరసాపురం నుంచి కుంభమేళాకు నాలుగు ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. దీనితో సంక్రాంతి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు ఉండవనే వాదనలు వినిపిస్తున్నాయి.

నరసాపూర్, విశాఖ, నాగర్‌సోల్, ఎల్‌టీటీ, శేషాంద్రి, సర్కార్, ధర్మవరం వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లకు మూడు నెలలు ముందుగానే టిక్కెట్స్ ఫుల్ అయ్యాయి. టిక్కెట్లు దొరకని వారు స్పెషల్ రైళ్లకు బుక్ చేసుకోవచ్చన్న ధీమాతో ఉన్నారు. రైల్వే కూడా వెయిటింగ్‌లిస్టు ఆధారంగా డిమాండ్ ఉన్న రూట్లలో స్పెషల్ రైళ్లను నడపాలని యోచించింది. కుంభమేళాతో రైళ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రైల్వే అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. స్పేర్‌గా ఉండే కోచ్‌లన్నీ స్పెషల్ రైళ్లగా మార్చి కుంభమేళా వైపు నడుపుతున్నారు. సంక్రాంతి స్పెషల్‌ను రైల్వే ఇంత వరకు ప్రకటించలేదు. సాధారణంగా జనవరి 7 నుంచే రైళ్లకు రద్దీ ఉంటుంది. తిరుగు ప్రయాణంలో 16 నుంచి 20 వరకు డిమాండ్ ఉంటుంది. ఈ సమాయాల్లోనే ఎక్కువ స్పెషల్ రైళ్లను నడపడం అనవాయితీ. రద్దీని తట్టుకునేందుకు 20 రోజుల ముందుగానే రైల్వే స్పెషల్ రైళ్లను ప్రకటించేది. ఇంత వరకు జాబితా లేకపోవడంతో ప్రయాణికుల్లో టెన్షన్ మొదలైంది.

రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు

దక్షిణమధ్య రైల్వే విజయవాడ విభాగం పరిధిలో పలు రైళ్ల రాకపోకల వేళలను మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి ఇవి అమలులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకుని ప్రయాణానికి సిద్ధమైన ప్రయాణికులు ఈ నెల 1 నుంచి వారు ప్రయాణించే రైలు ఏ సమయంలో వస్తుందో స్టేషన్ మేనేజర్‌ను కాని విచారణ కేంద్రాన్ని కాని, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను కాని, నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. నూజివీడు, పవర్ పేట, ఏలూరు, భీమడోలు రైల్వే స్టేషన్లలో ఎక్కిదిగే ప్రయాణికులు తాము ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకున్న సమయాలను పరిశీలించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718) విజయవాడ నుంచి విశాఖపట్టణం వెళ్లేది నూజివీడులో 6.50 గంటలకు వచ్చేది ఇప్పుడు 6.30 గంటలకే రానుంది. ఏలూరులో ఉదయం 6.50 గంటలకే వస్తుంది. ఏలూరు మీదుగా వెళ్లే 37 రైళ్ల సమయాలు మార్చారు.



వేంకటేశ్వరస్వామి ఆలయ అనివేటి మండపంలో యాత్రికులు

ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్షేత్రమైన ద్వారకా తిరుమల ఆలయం నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం తొలిరోజున స్వామిని దర్శించాలన్న ఆకాంక్షతో మంగళవారం సాయంత్రానికే అనేక మంది భక్తులు పాద యాత్రగా చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రంలో సందడి నెలకొంది. కొత్త సంవత్సరం అంతా శుభదాయకంగా ఉండాలని వివిధ ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి బారులు తీరారు. ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండాయి. పార్కింగ్ ప్రదేశం సైతం భక్తుల వాహనాలతో నిండిపోయింది.

రమణీయం.. ధనుర్మాస ఉత్సవం

శ్రీదేవి, భూదేవి సమేత గోదా దేవితో కలసి చినవెంకన్న తొళక్కవాహనంపై బుధవారం ఉదయం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ఈ ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఆలయ ఆవరణలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

రేపు ఏలూరు, జంగారెడ్డిగూడెంలో జాబ్‌మేళా

ఏలూరు కార్పొరేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు, జంగారెడ్డిగూడెంలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్రబాబు బుధవారం తెలిపారు. దాదాపు 150 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజి వంటి విద్యార్హతలు ఉండి 18 నుండి 30 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 9988853335 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చని చెప్పారు.

హిమ సోయగం



ద్వారకాతిరుమల క్షేత్రం వద్ద మంచుతెరలను చీల్చుకుంటూ భానుడు

హిమ సోయగంతో శ్రీవారి క్షేత్ర సౌందర్యం ఇనుమడించింది. శేషాచలంపై అలముకున్న మంచు తెరలు కొత్త సంవత్సవం మొదటి రోజు చూపరులకు కనువిందు చేసింది. శ్రీవారి ఆలయ పరిసరాలు, ఘాట్‌రోడ్డు ప్రాంతం, క్షేత్రపాలకుని ఆలయానికి వెళ్లే దారిలో దట్టమైన పొగమంచు అలుముకుంది. వేకువజామునే శ్రీవారి ఉత్సవానికి గోసంరక్షణ శాల నుంచి వస్తున్న గజలక్ష్మి, అశ్వాలు మంచుతెరల నడుమ విహరించాయి. ఉదయం 8-30 గంటల వరకూ భానుడి దర్శనం కలుగలేదు.

- ద్వారకాతిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయం వద్ద మంచులో శ్రీవారి దర్శనం కోసం వెళుతున్న భక్తులు

పందెం కోడికి వైరస్



గాబులోనే మృతిచెందిన కోడి



మృత్యువాత పడిన పందెం కోడి



దువ్వలో వెలవెలబోతున్న పందెం కోడిపుంజుల షెడ్లు, గాబులు

ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతికి కోడి పందేలు ప్రధాన ఆకర్షణ. పందేలకు కోళ్ల పెంపకం కుటీర పరిశ్రమ స్థాయిలో నడుస్తోంది. ప్రత్యేక పోషకాహారం, శిక్షణ, వ్యాక్సిన్లతో శాస్త్రీయ పద్ధతుల్లో పందెం కోళ్లను పెంచుతారు. ఈసారి ప్రతికూల వాతావరణంతో పందెంకోళ్లు పండుగకు ముందే పడిపోయాయి. రాచికెడ్ డిసీజ్ (ఆర్‌డీ), ఇతర వైరస్‌లతో మృత్యువాత పడ్డాయి. తణుకు మండలం దువ్వలో కొంతమంది పెంపకందారులు లక్షలాది రూపాయలు నష్టపోయారు.

- పందెంకోళ్లపై వైరస్ దాడి
- గంటల వ్యవధిలోనే వ్యాప్తి
- దువ్వలో కోళ్ల మృత్యువాత
- నాటు కోళ్లకు పెనుముప్పు
- వాతావరణ మార్పులతో ప్రభావం
- పెంపకందారులకు లక్షల్లో నష్టం
- సంక్రాంతి పండుగకు నిరాశే!

తణుకు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా నాటు కోళ్లు, పందెం కోడిపై వైరస్ దాడి చేసింది. కోళ్ల పెంపకందారులు నష్టాల్లో కూరుకుపోయారు. పందెం కోళ్లపై రాచికెడ్ డిసీజ్ (ఆర్‌డీ) ఇతర వైరస్‌ల కారణంగా గ్రామాల్లో ఎంతో శ్రద్ధగా పెంచుకున్న కోడి పుంజులు నిముషాల వ్యవధిలో మృత్యువాతపడ్డాయని పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తణుకు మండలంలోని దువ్వ, వేల్పూరు, తేతలి గ్రామాలు, తణుకు పట్టణంలోని పలువురు పందెం కోళ్లను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. వైరస్ కారణంగా ఒక్క దువ్వ గ్రామంలోనే సుమారు 18 మంది పెంపకందారుల వద్ద సుమారు 500 పందెం కోళ్లు, పెట్టలు మృత్యువాత పడినట్లు సమాచారం. వాటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని అంచనా. దువ్వ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు ఉమ్మడిగా వ్యవసాయం పనులు చేసుకుంటూ 14 ఏళ్లగా పందెంకోళ్లను పెంచుతున్నారు. గత నవంబరు, డిసెంబరులో వాతావరణ మార్పులతో కోళ్లకు ఆర్‌డీ వైరస్, ఇతర ఇన్ఫెక్షన్లు సోకడంతో కోడి పుంజులతో పాటు పెట్టలు, పిల్లలు కూడా మృత్యువాత పడ్డాయి. దువ్వలో ఈముగ్గురు వద్ద సుమారు 300పైగా కోళ్ల పుంజులు, పిల్లలు చనిపోవడంతో షెడ్‌లు ఖాళీ అయిపోయాయి. ఏటా సంక్రాంతికి సుమారు 100 నుంచి 150 కోడిపుంజులను విక్రయించే వారికి ఇప్పుడు ఒక్క పుంజు కూడా మిగల్లేదు. కోడి పిల్లలు, పెట్టలు కూడా వైరస్ మహమ్మారికి మృత్యువాత పడ్డాయి.



వైరస్ నిర్మూలనకు లోపలి భాగం గడ్డితో కాల్చిన షెడ్

వేల రూపాయల పుంజులు

సంక్రాంతి పండుగ రోజుల్లో కోడిపందేల కోసం ప్రత్యేకంగా పెంచుకునే కోడి పుంజు ధర రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ పలుకుతుంది. వీటి పెంప కానికి ప్రత్యేక ఆహార నియమాలతో ఎంతో శ్రద్ధగా పెంచుతారు. ప్రత్యేక పోషకాహారం, వ్యాక్సిన్‌లను ఇచ్చి శాస్త్రీయ పద్ధతుల్లో పెంచుతారు. సంక్రాంతి నెల రోజులకు ముందే పందెం పుంజులు చనిపోవడంతో పందెంరాయుళ్లకు కోడి పుంజుల కొరత వుంటుందని పేర్కొంటున్నారు. రెండు, మూడేళ్లు ఎంతో శ్రద్ధగా పెంచిన పందెం పుంజులు వైరస్‌తో చనిపోవడంతో పెంపకందారులు తీవ్ర నష్టాల బారినపడ్డారు. సంక్రాంతి సమీపించిన తరుణంలో కోడిపుంజులకు మంచి ధర వస్తుందని భావిస్తున్నామని, ఇంతలో కోడి పుంజులు, పెట్టలు రోజుల వ్యవధిలో మొత్తం మృత్యువాత పడడంతో పెట్టుబడి కూడా కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్రాంతి పందేలపై ప్రభావం!

గ్రామీణ ప్రాంతాల్లో పందెం కోడిపుంజులతో పాటు నాటు కోళ్లు అధికంగా వైరస్‌తో మృత్యువాత పడడం సంక్రాతికి కోడి పందేల ప్రభావం చూపనుంది. పందెం కోడి పుంజులు కొరత ఏర్పడుతందని పందెం రాయుళ్లు ఆందోళనలో పడ్డారు. సంక్రాంతి నాటికి పందెం పుంజుల సేకరణకు ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేసే పనిలో వున్నారు. ఇలా సేకరించిన పుంజులను జనావాసాలకు దూరంగా ప్రత్యేకంగా నివాసాలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరైతే సంక్రాంతి కోడి పందేల సమయానికి కోడి పుంజులను అందించేలా ఇతర ప్రాంతాల వారితో ఒప్పందాలు చేసుకుంటున్నారు.

40 పుంజులు చనిపోయాయి

సంక్రాంతి కోడి పందేల కోసం మూడేళ్లుగా కోడి పుంజులు పెంచుతూ ఉపాధి పొందుతున్నాను. నా షెడ్‌లో 40 పుంజులు చనిపోయాయి. వైద్యులు రాసిన మందులు వాడినా ఫలితం లేదు. గంటల వ్యవధిలోనే కోడి పుంజులు చనిపోవడంతో ఎంతో బాధపడ్డా. వారం రోజులు గడిస్తే సుమారు రూ.3 లక్షల వరకూ ఆదాయం వచ్చేది. కానీ అంతలోనే వైరస్ సోకడంతో మొత్తం చనిపోయాయి.

- గెల్లా నాగేశ్వరరావు, దువ్వ

నాటు కోడి, పందెంకోళ్లపై వైరస్ దాడి



పందెం కోళ్లు, నాటు కోళ్లు ఆర్‌డీ వైరస్, ఇతర ఇన్ఫెక్షన్‌తో మృత్యువాత పడుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా వుంది. వాతావరణ మార్పులు, ముఖ్యంగా శీతాకాలం కోళ్లలో ఈ సమస్య ఏర్పడుతుంది. ప్రస్తుతం ఈ సీజన్‌లో ఎక్కువగా వుంది. గాలి, నీరుతో పాటు మనుషులు, పశు, పక్షుల ద్వారా కూడా వ్యాపిస్తుంది. దీనితో చాలా కోళ్లు మృత్యువాత పడ్డాయి. వైరస్ నివారణకు బయో సెక్యూరిటీ ఉండాలి. అంటే కరోనా వైరస్‌లో మనుషులు పాటించిన భౌతిక దూరం మాదిరి పందెంకోళ్లను కొనుగోలు, అమ్మకాలు చేసే వ్యక్తులు ఒక షెడ్ నుంచి మరొక షెడ్‌కు వెళ్లడం వలన ఒక షెడ్‌లో వైరస్ వారి నుంచి షెడ్‌లో కోళ్లకు వ్యాపిస్తుంది. చాలా గ్రామాల్లో నాటు కోళ్లకు, పందెం కోళ్లకు వైరస్ సోకి చనిపోయాయి. వ్యాధి సోకి చనిపోయిన కోళ్ల షెడ్‌లను గడ్డితో కాల్చి శుభ్రం చేయడం ద్వారా వైరస్ పూర్తిగా అంతమవుతుంది. పందెం కోళ్లను పెంచే షెడ్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా వుంచుతూ సమయం ప్రకారం వ్యాక్సిన్ వేస్తే వైరస్‌కు కోళ్లను దూరంగా ఉంచవచ్చు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని మందులను కోళ్లకు అందించాలి. కోళ్లకు అందించే తాగునీటిని, పరిసరాలను శుభ్రంగా వుంచితే వ్యాధుల నుంచి రక్షణ కల్పించవచ్చు.

-వి.ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్థక శాఖ, జిల్లా పశు వైద్యశాల, తణుకు

గంట వ్యవధిలో మృత్యువాతపడ్డాయి



70 పుంజులు, 40 పెట్టలు, మరో 200 చిన్న పిల్లలను పెంచుతున్నా. కోడి పుంజులు గురక వ్యాధిలా వచ్చి గంటలోపే చయిపోయేవి. వైరస్ సోకి ఒక్కరోజులోనే వంద పైగా కోళ్లు చనిపోయాయి. వైరస్ సోకిన కోళ్లను తణుకు ప్రభుత్వ పశు వైద్య శాలకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. వారం రోజులు వుంటే సగం పుంజులు అమ్మేవాళ్లం. మూడేళ్ల కష్టం వృథా అయింది. 14 ఏళ్ల కోళ్ల పెంపకంలో ఇంత నష్టం ఎప్పుడూ చూడలేదు..

- ముద్దూరి శివ, రుద్ర వీర్రాజు, దువ్వ

ఇంకో వారం రోజులు గడిస్తే..



నేను పశువుల మందుల షాపు నిర్వహించుకుంటూ కోడి పుంజులను పెంచుతాను. వారం రోజులు గడిస్తే పుంజుల విక్రయాలతో ఆదాయం పొందేవాడిని. ప్రతీ ఏడాది 10 నుంచి 20 కోడి పుంజులను పోషించి అమ్ముతూ వుంటాను. నవంబరు, డిసెంబరులో వాతావరణ మార్పుల కారణంగా పుంజులకు వైరస్, ఇన్ఫెక్షన్ సోకింది. వెంట వెంటనే కోళ్లు మృత్యువాత పడడంతో సుమారు 2 లక్షల వరకూ నష్టం వచ్చింది.

- మద్దిరాల రామసతీష్, తణుకు

క్రైమ్ కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మంచిలి వద్ద గాయపడిన యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మోటారు సైకిళ్లు ఢీకొని యువకుడి మృతి

భీమవరం క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. భీమవరం టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం దుర్గాపురానికి చెందిన మర్రిపూడి మహేష్ (18) స్నేహితుడితో కలసి మంగళవారం రాత్రి సుమారు 2.30 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. దుర్గాపురం రామాలయం వద్ద ఎదురుగా మరో బైక్ వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేష్ మృతి చెందగా వెనుక కూర్చొన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా బైక్‌పై వస్తున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. మహేశ్ తండ్రి మర్రిపూడి వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

విశ్వనాద్రిపాలెంలో..

ముదినేపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం తొలిరోజునే బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన విశ్వనాద్రిపాలెంలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నత్తా వెంకటేశ్వరరావు (59) మోపెడ్‌పై బొమ్మినంపాడు వెళ్తుండగా, ఈడేపల్లి రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. తలకు బలమైన గాయాలయ్యాయి. 108లో గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీఎస్.వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

పెనుమంట్ర, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పొలమూరు గ్రామానికి చెందిన గాది కాశి (34) అత్తిలిలో స్నేహితుల వద్దకు వెళ్లి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నాడు. తిరిగి వస్తుండగా పంపనవారిపాలెం మంచిలి మధ్య పుంతల ముసలమ్మ గుడి దగ్గర మోటార్ సైకిల్‌పై నుంచి పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్పందించిన స్నేహితులు పెనుమంట్ర 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బాల కృష్ణ, పైలెట్ బ్రహ్మాజీ సహకారంతో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం బ్రాహ్మణ చెరువులోని ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు..

వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలు

ఇరగవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఐతంపూడిలో బుధవారం ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓగిడి గ్రామానికి చెందిన అన్నదమ్ములు పెన్నాడ సుధీర్‌బాబు, పెన్నాడ కిరణ్ బాబు కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం పెనుగొండ మార్కెట్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా వడలి గ్రామానికి చెందని రాయి వెంకటేశ్వరరావు, జల్లి దుర్గారావు, గోటేరులో ప్రార్థనా మందిరానికి వెళ్లి వస్తూ ఐతంపూడి రైస్‌మిల్లు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘనటలో గాయపడిన నలుగురిని 108 వాహనంలో తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించారు. వడలి గ్రామానికి చెందిన రాయి వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరో ముగ్గురు తణుకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇరగవరం ఎస్ఐ జానా సతీష్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతున్న వృద్ధుడిని రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పవర్‌పేట వద్ద బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వృద్ధుడు పట్టాలు దాటుతుండగా ఏలూరు నుంచి విజయ వాడ వైపు అతి వేగంగా వెళుతున్న రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుమారు 60 ఏళ్ళ వయస్సు కల్గి ఎరుపు రంగు శరీరంతో ఉన్నాడు.లోకోపైలెట్ ఈ సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందించారు. ప్రస్తుతం మృతదేహం రైలు పట్టాల వద్దే ఉంది.

డ్రెయిన్‌లో మహిళ మృతదేహం

ఉండి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బొండాడ డ్రెయిన్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని ఉండి పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని 40నుంచి 45 ఏళ్ల మహిళ మృతదేహం బుధవారం తేలినట్లు పోలీసులు తెలిపారు. పాములపర్రు, కొండగూడెం, ఉండి మీదుగా ప్రవహించే బొండాడ డ్రైయిన్‌లో పడవలరేవు వద్ద మృతదేహం ఉందని పోలీసులు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే 9440796648, 08816276233 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ నజీరుల్లా కోరారు.

మంచినీటి చెరువులో పడి..

ఉండి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మంచినీటి చెరువులో తామరాకులను కోయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఒకరు మృతిచెందాడు. బుధవారం రాత్రి పోలీసులు సంఘటన వివరాలలు తెలిపారు. చెరుకువాడకు చెందిన కూర్మా పెద్దిరాజు (40) మాంసపు దుకాణాలకు తామరాకులను వేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం చెరుకువాడ మంచినీటి చెరువులో తామరాకులను కోయడానికి దిగిన వ్యక్తి చెరువులో పడిపోయి మృతిచెందాడు. భార్య వెంకటలక్ష్మి అదేరోజు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

మంటలు అంటుకుని వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : చలి ఎక్కువగా ఉండడంతో తెల్లవారుజామున ఒక వృద్ధురాలు చలిమంట వేసుకుంది. ప్రమాదవశాత్తు ఆ మంటలు అంటుకోవడంతో తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను తొలుత చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే మృతి చెందింది. టి.నరసాపురం మండలం రాజుపాలెం పంచాయతీలోని అల్లంచర్ల గ్రామానికి చెందిన శీలం సీతారావమ్మ (66) బుధవారం తెల్లవారుజామున చలి ఎక్కువగా ఉండడంతో ఇంట్లో చలిమంట వేసుకుంది. ప్రమాదవశాత్తు మంటలు అటుకుని తీవ్ర గాయాలపాలైంది. ఆమెను చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మద్యం మత్తులో ఒకరు..

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం తాగి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు శనివారపుపేటలోని మార్కెట్‌నకు సెంటర్‌నకు చెందిన ఉదయభాస్కరరాజు (49)కి 18 ఏళ్ళ క్రితం అతని భార్య మరణించింది. వారికి ఇద్దరు కుమారులు ఉండగా వారు పిన్ని వద్దకు వెళ్ళి జీవిస్తున్నారు. ఒంటరిగా ఉంటున్న ఉదయభాస్కర రాజు రిక్షా తొక్కుతూ జీవిస్తున్నాడు. అతిగా మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం తాగి అనారోగ్యానికి గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఉదయభాస్కరరాజు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

నూతిలోపడి ఒకరి మృతి

మద్యం మత్తులో ఒకరు తన ఇంటి ఆవరణలో నూతిలోపడి మృతి చెందాడు. ఏలూరు హనుమాన్ నగర్‌నకు చెందిన మురాల శ్రీనివాసరావు (52)కు 30 ఏళ్ళ క్రితం వివాహం కాగా అతను అతిగా మద్యం తాగడంతో అతని భార్యతో మనస్పర్ధలు ఏర్పడ్డాయి. దీంతో ఆమె అతనిని విడిచిపెట్టి కొన్నేళ్లక్రితం వెళ్ళిపోయింది. ఒంటరిగా ఉంటూ టైలరింగ్ చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 31 రాత్రి పూటుగా మద్యంగా తాగి తన ఇంటి ఆవరణలో ఉన్న నూతిలోపడి మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి బుధవారం వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎన్జీవో అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్

సీఎం చంద్రబాబును కలిసిన ఎన్జీవో అసోసియేషన్ నాయకుడు

ఏలూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని తాడేపల్లి కార్యాలయంలో ఉద్యోగ సంఘాల నాయకులు కలుసుకున్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, ఏపీ పేఅండ్ అకౌంట్స్ ఆఫీస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ హరనాథ్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో భూగర్భ పైప్‌లైన్

నూజివీడు టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మురుగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించినట్లు అయింది. ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో ఎస్‌టిపి వాటర్ డిస్పోజ్‌బుల్ సమస్య పరిష్కారానికి భూగర్భపైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో పైప్‌లైన్ నిర్మాణానికి సంబంధించి వెల్‌కో ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌కు పనులు అప్పగించినట్లు నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరక్టర్ అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణ్ తెలిపారు.

కోర్టు జూనియర్ అసిస్టెంట్‌పై కేసు

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఒక కేసులో డాక్యుమెంట్‌కు ఎస్ఆర్ నెంబర్ సంబంధిత జడ్జి ఇవ్వకుండానే జూనియర్ అసిస్టెంట్ తప్పుడు నెంబర్ ఇచ్చాడనే అభియోగంతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న మొబైల్ కోర్టులో సీహెచ్ రఘురామప్రసాద్ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సీసీ నెంబర్ 83/2011కు సంబంధించి ఎస్ఆర్ బుక్‌లోని నెంబర్‌ను మార్చి ఎస్ఆర్ నెంబర్ 7154ఎగా కేటాయించి జూనియర్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడ్డారని న్యాయవాది జి.బాబూగణేశ్ గమనించి కోర్టులో ఫిర్యాదు చేశారు. కోర్టులో ప్రాథమిక విచారణ చేసి ఎస్ఆర్ పుస్తకంలో మార్పులు చేసినట్లు గుర్తించి జిల్లా ప్రధాన న్యాయమూర్తికి నివేదిక ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మొబైల్ కోర్టు సూపరింటెండెంట్ కేసన ఉదయ శ్రీనివాసరావు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో త్రి టౌన్ పోలీసులు జూనియర్ అసిస్టెంట్ రఘురామ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఏలూరులో నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే చంటి


ఎమ్మెల్యే రోషన్‌కు నాయకుల శుభాకాంక్షలు


దుగ్గిరాలలో వేడుకలు జరుపుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్


ఉంగుటూరులో ఎమ్మెల్యే ధర్మరాజుకు శుభాకాంక్షలు


భీమడోలులో గన్నికి శుభాకాంక్షలు

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

ఏలూరుసిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో కొత్త సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. యువత కేరింతలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి 12 గంటలకు బాణసంచా కాలుస్తూ , డాన్సులు చేస్తూ యువత 2025 నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఇక బుధవారం తెల్లవారుఝాము నుంచే ప్రముఖ పుణ్యక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, మద్ది అంజనేయస్వామి ఆలయం, హనుమాన్‌జంక్షన్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం, గోకులపారిజాతగిరి, ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద విశేషంగా భక్తుల సందడి కనిపించింది. ఇక క్రైస్తవ సోదరులు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధికారులు, ఎమ్మెల్యేలకు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు టూ టౌన్: ప్రజలంతా సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఎమ్మెల్యేను కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేని కలసిన వారిలో మేయర్ షేక్ నూర్జహాన్, నగర కమిషనర్ భానుప్రతాప్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, అధికారులు ఉన్నారు. అనంతరం కేకు కట్ చేశారు. ఎమ్మెల్యే సన్మానించారు.

పెదవేగి: నూతన సంవత్సరం అంతా శుభకరంగా సాగుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్ళ చీకటి రోజులని, దాని నుంచి బయటపడిన రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంద న్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. పార్టీ నాయకులు ఉప్పలపాటి శ్రీరామ్‌ప్రసాద్, కొడాలి ఆంజనేయ చౌదరి, తాతా సత్య నారాయణ, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణ ప్రసాద్, ఎం. శ్రీనివాసరావు, గుత్తా అనిల్, సైదు సత్యనారా యణ, నేతల రవి, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్‌చేసిన ఎమ్మెల్యేలు

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. బుధవారం తన కార్యాలయం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, లింగ పాలెం మండలాల నుంచి పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, కూటమి శ్రేణులు భారీగా పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, కె.రాజారెడ్డి, అట్లూరి శ్రీనివాసరావు, కోనేరు సుబ్బారావు, సుధీర్, చలపతిరావు, సాయల సత్యనారాయణ, రాంకుమార్, మరీదు వెంకట్రావు, రాధారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు/నిడమర్రు: ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో భీమడోలు, నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు మండలాల ప్రజా ప్రతినిధులు, కూటమి కార్యకర్తలు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మికి మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

భీమడోలు: భీమడోలులోని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఉంగుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు గన్ని వీరాంజనేయులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏలూరు రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా ఉదయం రెడ్డి అప్పల నాయుడు నివాసం వద్ద ప్రముఖులు, జనసేన నాయకులు, అన్నివర్గాల ప్రజలు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు ఎంపీపీ శ్రీనివాసరాజును మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలత, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛం అందజేశారు. స్నేహం అసోసియేషన్ అధ్యక్షుడు అంబి కా రాజా నివాసంలో వేడుకలు నిర్వహించారు. వాణిజ్య, వ్యాపార, ఆర్యవైశ్య సంఘం నాయకులు కలిసి అభినందించారు.


మంత్రి నాదెండ్లకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న రెడ్డి అప్పలనాయుడు

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం


బుట్రింకలపాడులో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న కరాటం, ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. బుర్రింకలపాడులో జనసేన పార్టీ కార్యాలయాన్ని జనసేన నాయకులు కరాటం రాంబాబు, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము, పోలవరం డీఎస్పీ బి.వెంకటేశ్వరావు, జీలుగుమిల్లి, కుక్కునూరు, పోలవరం సీఐలు బి.వెంకటేశ్వరావు, బాల సురేష్‌బాబు, సురేష్‌బాబు సర్కిల్ పరిధిలో ఎస్సైలు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


బుట్టాయగూడెంలో కేక్ కట్ చేస్తున్న ట్రైకార్ చైర్మన్ బొరగం

ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బుట్టాయగూడెం, జనవరి 1: (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బుధవారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్లు అందుకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ట్రైకార్ నిధులు పక్కదారి పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం వారికి కేటాయించిన నిధులు పూర్తిగా గిరిజనుల సంక్షేమానికే ఖర్చు పెడుతుందన్నారు. ఐటీడీఏలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, రావాల్సిన నిధుల కోసం ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. నాయకులు పారేపల్లి రామారావు, మొగపర్తి సోంబాబు, యంట్రప్రగడ శ్రీనివాసరావు, శీలం వెంకటేశ్వరావు, ఉండవల్లి సోమసుందరం, గద్దె అబ్బులు, మానెల్లి బాలు, ఉన్నారు.

ముగిసిన మెగా క్రికెట్ టోర్నమెంట్



కుక్కునూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరులో పదిరోజులుగా జరుగుతున్న కుచ్చెర్లపాటి రామకృష్ణంరాజు మెగా క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. కుక్కునూరుకు చెందిన క్రికెట్ టీమ్ విజేతగా నిలిచింది. విజేతలకు రూ.25 వేలు నగదు బహుమతి, షీల్డు అందజేశారు. టీడీపీ నాయకులు కుచ్చెర్లపాటి అప్పలరాజు, ఎంపీటీసీ శ్రీదేవి, ముప్పాల సాంబ శివరావు, మురళీమోహన్, భాగ్యలక్ష్మి, కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ఫేస్ మాస్కులతో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

ఏలూరు అర్బన్/రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు చింతమనేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్‌లోని కె.పి.డి.టి.హైస్కూలు ఆడిటోరియంలో నిర్వహిస్తున్న 100 రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. శిక్షణార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ నెల 3న జరుగనున్న ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని డీఎస్సీ శిక్షణార్థులు చింతమనేని ప్రభాకర్ ఫేస్ మాస్కులను ధరించి ముందస్తు శుభాకాంక్షలు తెలియజేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టుదలతో కృషిచేసి డీఎస్సీలో విజయంసాధించి ఎక్కువమంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని సూచించారు. అభ్యర్థులకు ఆహారపదార్థాలను ఎమ్మెల్యే వడ్డించారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి



ద్వారకాతిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల ఆర్థికాభి వృద్ధికి తమ యూనియన్ దోహద పడు తుందని తిరు మల డైరీ మేనే జర్ శ్యామ్‌కుమార్ అన్నారు. మండలం లోని దేవినేనివారి గూడెంలో తిరుమల డైరీ ఆధ్వర్యంలో పాల సేకరణ కేంద్రం వద్ద బుధవారం రైతులకు మాజీ సర్పంచ్ పీటీ భీమేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచితంగా దాణా, మందులు, పాలక్యానులు, క్యాలెండర్లు, స్వీట్లు అందజేశారు. రైతులకు పశుపెంపకంపై సూచనలు, సలహాలు అందజేశారు. ఆగ్రోస్ ప్రతినిధి గీత, రైతులు వెంకటేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లా అధికారి ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలి


కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జిల్లా అధికారులు

ఏలూరు సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలోని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వినిని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులందరూ ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని వచ్చే ఏడాది మోడల్ గ్రామాలుగా ప్రకటించేలా చొరవ చూపాలని కోరారు. ఇది మన నూతన సంవత్సర తీర్మానంగా రూపకల్పన చెందాలన్నారు.

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు

జిల్లా ఎస్పీ శివకిషోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్‌కలెక్టర్ బి స్మరణ్‌రాజ్, కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు ఎమ్మె ల్యే చంటి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ దంపతులు, నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంప తులు కలెక్టర్ కె వెట్రిసెల్విని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా జిల్లా రెవె న్యూ అధికారి వి విశ్వేశ్వర రావు, ఆర్డీఓలు అచ్యుత అంబరీష్, ఎంవీ రమణ, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కె భాస్కర్, ఏపీఈపీడీఎల్ ఎస్ఈ పి సాల్మన్ రాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా, జిల్లా ఉద్యాన శాఖా ధికారి ఎస్ రామ్మోహన్, ఏపీఎంఐపీ పీడీ రవికుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఏ భానుప్రతాప్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ వెంకటేశ్వర రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, ఎల్‌డీఎం డి. నీలాద్రి, బీసీ కార్పోరేషన్ ఈడి ఎన్ పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఆర్. నాగరాణి, జిల్లా ఫైర్ అధికారి రత్నకుమార్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చాలా మంది బొకేలు బదులు పేద విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు, దుప్పట్లు అందజేసి శుభాకాంక్షలు తెలపగా వారికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.


యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శ్రీలత


టి. నరసాపురంలో క్యాలెండర్ ఆవిష్కరించిన దృశ్యం

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఏలూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ సూచనల మేరకు న్యూఇయర్‌కు బొకేలు, శాలువాలు, ఇతర వస్తువులకు బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్‌బుక్స్ ఇవ్వాలని సూచించడంతో ఎన్జీవో నాయకులు నోటుపుస్తకాలు, బాల్ పెన్నులు అందచేశారు. అధ్యక్షుడు చోడగిరి శ్రీని వాస్, ఏలూరు తాలూకా అధ్యక్షుడు జి.శ్రీధర్‌రాజు, కార్యదర్శి కె. సత్యనారాయణ, నాగమణి, మహిళా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- యూటీఎఫ్ ఏలూరు మండల శాఖ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలత, ఎంఈవో ఆవిష్కరించారు. మండల నాయకుడు రాంబాబు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ముద్రించిన డైరీ, క్యాలెండర్‌లను రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజ్ కుమార్, ఆడిట్ కమిటీ సభ్యులు జి.గణపతి, ఆర్.శ్యామ్‌సుందర్, ఆర్.సూర్యనారాయణ తదిత రులు ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీని కలిసి అందజేశారు.

టి.నరసాపురం: రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకుడు దావులూరి సూర్యనారాయణ, టీడీపీ, పోలవరం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలకా బాలయ్య ఆధ్వర్యంలో నూతన క్యాలెం డర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వర రావు బుధవారం ఆవిష్కరించారు. తోట లక్ష్మీ నారాయణ, గండబోయిన శ్రీను, సామాజిక కార్యకర్త లంకా జయబాబు, పేరుబోయిన శ్రీను, వాసిరెడ్డి రామ్మోహన్, సందేపూడి సాయి, చిలకా బాలయ్య, చిలకా సుబ్బు, దావులూరి సూర్యనారాయణ,కలిశెట్టి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యుఎస్) జిల్లా శాఖ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, డోర్ స్టిక్కర్లను స్థానిక కేపీడీటీ హైస్కూలు ఆడిటోరియంలో డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహిస్తోన్న శిక్షణ తరగతుల శిబిరం లో బుధవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న పదోతరగతి పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిం చడంలో తమ ప్రభుత్వం స్నేహపూర్వకంగా వ్యవహరిస్తుందన్నారు. సంఘ జిల్లా అధ్యక్షులు నందిగం శ్రావణి, పశ్చిమ గోదావరి జిల్లాశాఖ అధ్యక్షుడు పేరాబత్తిని సురేష్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు నెరుసు రాంబాబు, డీఎస్సీ శిక్షణ శిబిరం నిర్వాహకులు యు.రాంప్రసాద్ తదితరులు పాల్గొ న్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) ముద్రించిన క్యాలెండర్, డైరీలను డీఈవో వెంకట లక్ష్మమ్మ, సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్ ఆవిష్కరించి మాట్లాడుతూ 'నారీ శక్తి' పేరుతో గొప్ప విజయాలు సాధించిన మహిళల వివరాలను డైరీలో పొందుపర్చడం అభినందనీయమన్నారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు పాల్గొన్నారు. పీఆర్టీయూ జిల్లాశాఖ క్యాలెండర్లు, డైరీలను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఏలూరు ఇన్‌చార్జి డీవైఈవో రవిప్రకాష్, ఎంఈవో-2 డీ.వి.రమణ ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

పెదవేగి: ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని ఎమ్మెల్యే చింతమనేని అన్నారు. ఎస్టీయూ కేలండర్, డైరీని ఎమ్మెల్యే ప్రభాకర్ దుగ్గిరాల కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించా రు. ఎస్టీయూ పెదవేగి మండల అధ్యక్షుడు పరసా నాగార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామం - రావణం సినిమాకు శ్రీకారం



ఏలూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువు సంఘటితం కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణకిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం దొండపాడులోని బాబాశివ అఘోరీజి పీఠంలో రామం - రావణం సినిమా పోస్టర్‌ను శివ అఘోరాజి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణకిషోర్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని ప్రపంచానికి తెలియజేసేలా రామం - రావణం చిత్రం నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు. బాబా శివ అఘోరి నిర్మాత కావూరి లావణ్యను అభినందించారు. వేదాల్లో నిగూడంగా ఉన్న విజ్ఞానాన్ని వెలికితీసి సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పేలా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భారీ బడ్జెట్‌తో రామం- రావణం సినిమా నిర్మిస్తున్నట్లు నిర్మాత కావూరి లావణ్య తెలిపారు. ఈ చిత్రానికి దాసరి సారథి దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో సినిమాను సెట్స్‌మీదకు తీసుకువెళుతున్నట్లు యూనిట్ సభ్యులు తెలిపారు.

చెత్త తొలగించండి..



యర్రగుంటపల్లి పంచాయతీ మక్కినవారిగూడెం రోడ్డులో ప్రాథమిక ఆసుపత్రి ఎదురుగా రోడ్డు పక్కన గ్రామంలో సేకరించిన చెత్తను ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. దీంతో దుర్వాసన, వెదజల్లుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఆసుపత్రికి వచ్చే రోగులకు, ఈ మార్గంలో వెళ్ళే వాహనదారులకు దుర్వాసనతో వాంతులు అవుతున్నాయని వాపోతున్నారు. దీనిపై అటు మండల పరిషత్ సమావేశంలోను, పంచాయతీ దృష్టికి తెచ్చినా చర్యలు తీసుకోకలేదు. ఉన్నతాధికారులు చెత్తను తొలగించి ఆసుపత్రికి వచ్చే రోగులకు, పక్కనే ఉన్న ఆర్‌సిఎం చర్చికి వచ్చే దైవ భక్తులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-చింతలపూడి




కాంతులీనుతున్న ఐసీఎం చర్చి.. (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న బిషప్ జాన్ ఎస్‌డీ రాజు

ఆధ్యాత్మికం

చర్చిల్లో ఆరాధనలు

ఏలూరు టూ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం రాత్రి నుంచి చర్చిలలో నూతన సంవత్సర ఆరాధనలు ప్రారంభమయ్యాయి. గత ఏడాదిలో చేసిన తప్పులను మరలా చేయకుండా నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పలువురు మతబోధకులు ప్రబోధించారు. ఏసుక్రీస్తు జన్మించిన ఏడురోజుల తరువాత జనవరి 1న మొట్టమొదటి సారిగా ప్రభువును ఆయన తల్లిదండ్రులు చర్చిలోకి తీసుకొచ్చి ఆరాధనలు నిర్వహించారు. క్రైస్తవ సోదరులు ఆ రోజును గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా జనవరి 1న ఏసుక్రీస్తును చర్చిలలో ఆరాధిస్తారు. నగరంలో అమలోద్భవి సెత్రడల్‌లో రెవరెండ్ ఫాదర్ మైఖేల్ దివ్యబలిపూజ నిర్వహించారు. ఐసీఎం చర్చిలో బిషప్ జాన్ ఎస్‌డీ రాజు నూతన సంవత్సర ఆరాధనలు నిర్వహించారు. మన్నా చర్చ్‌లో బిషప్ ఎలీషారాజు ఆధ్వర్యంలో పాస్టర్ ఎం.జ్యోతిరాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూతనంగా మారు మనస్సు పొంది న భక్తులకు బాప్తీస్మం ఇచ్చారు. వలివల ప్రార్థన మందిరంలో పాస్టర్ అదాం సురేష్ దేవుడి వాక్యాన్ని వినిపించారు. ఎల్ఈఎఫ్ చర్చిలో బ్రదర్ సురేష్ మార్కస్, సిస్టర్ ప్రిస్కిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. బెన్నియేలు చర్చిలో పాస్టర్ జాన్‌బాబు దైవ సందేశాన్ని అందించారు. ఇంకా నగరంలో పలు చర్చిలలో ఆరాధనలు జరిగాయి.

ఆలయాలు కిటకిట..



ఏలూరు కార్పొరేషన్: నూతన సంవత్సరం కావడంతో బుధవారం నగరంలోని ఆలయా లు భక్తులతో కిటకిటలాడాయి. వేంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద ధనుర్మాస పూజలు, తిరుప్పావై ప్రవచనాల్లో పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న గ్రామసభలు

కామవరపుకోట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామసభల్లో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకుంటున్నారని మండల తహసీల్దార్ గెడ్డం ఎలీషా పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ శుభం కలగాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.


రగ్గులు అందిస్తున్న మహేష్‌యాదవ్

చిన్నారులకు రగ్గుల వితరణ

ఏలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక అమ్మప్రేమ స్వచ్ఛంద సేవాసంస్థలోని చిన్నారులకు టి.నరసాపురం మండలం మల్లుకుంట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరు ఎంపీ పుట్టామహేష్ యాదవ్ అంటే తనకెంతో అభిమానమని, కొత్త సంవత్సరంలో ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చిన్నారుల మధ్య కేక్‌కట్‌చేసి పంచారు.



పేదలకు దుప్పట్ల పంపిణీ

టి.నరసాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాజు పోతేపల్లి గ్రామంలో జాస్తి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు జాస్తి సుబ్బారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం 300 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రైమ్ కార్నర్

ల్యాబ్ టెక్నీషియన్ అదృశ్యం

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పటమట సాయి అనంతమోహన్ (29) అదృశ్యమయ్యాడని ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఏలూరు పవర్‌పేటనకు చెందిన పడమటి సాయి అనంతమోహన్ (29) గత నెల 31వ తేదీ రాత్రి 12.20 గంటలకు అతని స్నేహితుడు గ్రంధి మహేష్ ఫోన్ చేసి కర్రల వంతెన వద్దకు రావాలని, తన బంధువు ఒకనిని కొంత మంది వేధిస్తున్నారని చెప్పడంతో సాయి అనంతమోహన్ వెంటనే కర్రల వంతెన వద్దకు వెళ్ళారు. అక్కడ నుంచి అతని ఫోన్ స్విచ్ ఆగిపోయింది. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో చివరకు బుధవారం రాత్రి ఏలూరు టూటౌన్ పోలీసులకు అతని తండ్రి రవికుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడిపందేలపై దాడులు

ద్వారకాతిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడి పందేలు, పేకాట స్థావరాలపై ద్వారకా తిరుమల పోలీసులు బుధవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో పది మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి సుమారు రూ.27 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. దొరసానిపాడులో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అదుపులో తీసుకుని రూ22,700లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వేంపాడు లో కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

వరి కుప్ప అగ్నికి ఆహుతి

చింతలపూడి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రగడవరంలో నందిపాం మారేషు వరి కుప్ప బుధవారం ఉదయం దగ్ధమవడంతో ఆ కుటుంబం బోరున విలపిస్తోంది. చింతలపూడి అగ్నిమాపక శాఖ మంటలను అదుపులోకి తెచ్చినా 90 శాతం పంట దగ్ధమైంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ప్రభుత్వం సహాయం చేయాలని రైతు కుటుంబం వేడుకుంటోంది.



రైళ్లన్నీ కుంభమేళా వైపు!

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు లేనట్లే.?

నరసాపురం/ఏలూరు క్రైం, జనవరి1(ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా నడిచే రైళ్ల టిక్కెట్లు నెలల క్రితమే బుక్ అయ్యాయి. సంక్రాంతి రద్దీతో స్లీపర్ నుంచి ఏసీ వరకు టిక్కెట్ల బుకింగ్‌తో వెయిటింగ్‌లిస్టు వంద వరకు వెళ్లింది. దీంతో ప్రయాణికులు స్పెషల్ రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 10 నుంచి ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వే పెద్ద సంఖ్యలో రైళ్లను నడపనుంది. ఇప్పటికే నరసాపురం నుంచి కుంభమేళాకు నాలుగు ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. దీనితో సంక్రాంతి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లు ఉండవనే వాదనలు వినిపిస్తున్నాయి.

నరసాపూర్, విశాఖ, నాగర్‌సోల్, ఎల్‌టీటీ, శేషాంద్రి, సర్కార్, ధర్మవరం వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లకు మూడు నెలలు ముందుగానే టిక్కెట్స్ ఫుల్ అయ్యాయి. టిక్కెట్లు దొరకని వారు స్పెషల్ రైళ్లకు బుక్ చేసుకోవచ్చన్న ధీమాతో ఉన్నారు. రైల్వే కూడా వెయిటింగ్‌లిస్టు ఆధారంగా డిమాండ్ ఉన్న రూట్లలో స్పెషల్ రైళ్లను నడపాలని యోచించింది. కుంభమేళాతో రైళ్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రైల్వే అన్ని ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. స్పేర్‌గా ఉండే కోచ్‌లన్నీ స్పెషల్ రైళ్లగా మార్చి కుంభమేళా వైపు నడుపుతున్నారు. సంక్రాంతి స్పెషల్‌ను రైల్వే ఇంత వరకు ప్రకటించలేదు. సాధారణంగా జనవరి 7 నుంచే రైళ్లకు రద్దీ ఉంటుంది. తిరుగు ప్రయాణంలో 16 నుంచి 20 వరకు డిమాండ్ ఉంటుంది. ఈ సమయాల్లోనే ఎక్కువ స్పెషల్ రైళ్లను నడపడం ఆనవాయితీ. రద్దీని తట్టుకునేందుకు 20 రోజుల ముందుగానే రైల్వే స్పెషల్ రైళ్లను ప్రకటించేది. ఇంత వరకు జాబితా లేకపోవడంతో ప్రయాణికుల్లో టెన్షన్ మొదలైంది.

రైళ్ల రాకపోకల సమయాల్లో మార్పులు

దక్షిణమధ్య రైల్వే విజయవాడ విభాగం పరిధిలో పలు రైళ్ల రాకపోకల వేళలను మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి ఇవి అమలులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకుని ప్రయాణానికి సిద్ధమైన ప్రయాణికులు ఈ నెల 1 నుంచి వారు ప్రయాణించే రైలు ఏ సమయంలో వస్తుందో స్టేషన్ మేనేజర్‌ను కాని విచారణ కేంద్రాన్ని కాని, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను కాని, నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. నూజివీడు, పవర్‌పేట, ఏలూరు, భీమడోలు రైల్వే స్టేషన్లలో ఎక్కిదిగే ప్రయాణికులు తాము ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకున్న సమయాలను పరిశీలించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718) విజయవాడ నుంచి విశాఖపట్టణం వెళ్లేది నూజివీడులో 6.50 గంటలకు వచ్చేది ఇప్పుడు 6.30 గంటలకే రానుంది. ఏలూరులో ఉదయం 6.50 గంటలకే వస్తుంది. ఏలూరు మీదుగా వెళ్లే 37 రైళ్ల సమయాలు మార్చారు.



వేంకటేశ్వరస్వామి ఆలయ అనివేటి మండపంలో యాత్రికులు

ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమల ఆలయం నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం తొలిరోజున స్వామిని దర్శించాలన్న ఆకాంక్షతో మంగళవారం సాయంత్రానికే అనేక మంది భక్తులు పాదయాత్రగా చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రంలో సందడి నెలకొంది. కొత్త సంవత్సరం అంతా శుభదాయకంగా ఉండాలని వివిధ ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి బారులు తీరారు. ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండాయి. పార్కింగ్ ప్రదేశం సైతం భక్తుల వాహనాలతో నిండిపోయింది.

రమణీయం.. ధనుర్మాస ఉత్సవం

శ్రీదేవి, భూదేవి సమేత గోదా దేవితో కలసి చినవెంకన్న తొళక్కవాహనంపై బుధవారం ఉదయం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ఈ ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఆలయ ఆవరణలో తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

రేపు ఏలూరు, జంగారెడ్డిగూడెంలో జాబ్‌మేళా

ఏలూరు కార్పొరేషన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు, జంగారెడ్డిగూడెంలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్రబాబు బుధవారం తెలిపారు. దాదాపు 150 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుండి 30 ఏళ్ల మధ్య వయస్సు వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 9988853335 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చని చెప్పారు.

కోర్టు జూనియర్ అసిస్టెంట్‌పై కేసు

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఒక కేసులో డాక్యుమెంట్‌కు ఎస్‌ఆర్ నెంబర్ సంబంధిత జడ్జి ఇవ్వకుం డానే జూనియర్ అసిస్టెంట్ తప్పుడు నెంబర్ ఇచ్చాడనే అభియోగంతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైం ది. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న మొబైల్ కోర్టులో సీహెచ్ రఘురామప్రసాద్ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సీసీ నెంబర్ 83/2011కు సంబంధించి ఎస్‌ఆర్ బుక్‌లోని నెంబర్‌ను మార్చి ఎస్‌ఆర్ నెంబర్ 7154ఎగా కేటాయించి జూనియర్ అసిస్టెంట్ అవకతవ కలకు పాల్పడ్డారని న్యాయవాది జి.బాబూగణేశ్ గమనించి కోర్టులో ఫిర్యాదు చేశారు. కోర్టులో ప్రాథమిక విచారణ చేసి ఎస్‌ఆర్ పుస్తకంలో మార్పులు చేసినట్లు గుర్తించి జిల్లా ప్రధాన న్యాయమూర్తికి నివేదిక ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మొబైల్ కోర్టు సూపరింటెండెంట్ కేసన ఉదయ శ్రీనివాసరావు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో త్రి టౌన్ పోలీసులు జూనియర్ అసిస్టెంట్ రఘురామ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ అదృశ్యం

ఏలూరు క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పటమట సాయి అనంతమోహన్ (29) అదృశ్యమయ్యాడని ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఏలూరు పవర్‌పేటనకు చెందిన పడమటి సాయి అనంతమోహన్ (29) గత నెల 31వ తేదీ రాత్రి 12.20 గంటలకు అతని స్నేహితుడు గ్రంధి మహేష్ ఫోన్ చేసి కర్రల వంతెన వద్దకు రావాలని, తన బంధువు ఒకనిని కొంత మంది వేధిస్తున్నారని చెప్పడంతో సాయి అనంతమోహన్ వెంటనే కర్రల వంతెన వద్దకు వెళ్ళారు. అక్కడ నుంచి అతని ఫోన్ స్విచ్ ఆగిపోయింది. అతని కోసం కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో చివరకు బుధవారం రాత్రి ఏలూరు టూటౌన్ పోలీసులకు అతని తండ్రి రవికుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వరహాపట్నంలో ఎమ్మెల్యే కామినేనిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి నేతలు



ముదినేపల్లిలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు



కలిదిండి మండలం వెంకటాపురంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కూటమి నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు

కొత్త ఆశలతో..

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కైకలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా ఎక్కడ చూసినా ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఒకరినికొకరు ఆప్యాయంగా పలకరించుకుని మంచి అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. బుధవారం ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కైకలూరు శ్యామలాంబ అమ్మవారు, మీసాల వేంకటేశ్వరస్వామి, కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయాల్లో భక్తులు వేకువజామున నుంచే పెద్దఎత్తున దర్శనార్థమై తరలివచ్చారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరహాపట్నంలోని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించి అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. నియోజక వర్గంలోని ఎండోమెంట్ ఆలయాల అధికారులు అర్చక బృందం, ప్రత్యేక ప్రవచనాలను నిర్వహించి శుభాకాం క్షలు తెలిపారు. నియోజకవర్గం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తరలి వచ్చి కామినేనికి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జనసేనలో చేరిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ ఎమ్మెల్యే కామినేనిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆటపాకలోని జయమంగళ నివాసం వద్ద అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరపగా ఎమ్మెల్సీ జయమంగళ వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథ రాజు, చల్లగుల్ల శోభనాద్రి చౌదరి, బలే ఏసురాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, తాడినాడ బాబు, కైకలూరు సర్పంచ్ నవ రత్నకుమారి, డీసీ చైర్మన్‌లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, సర్పం చ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలో బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్‌ను ముదినేపల్లిలో నియోజకవర్గంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కేక్‌కట్ చేశారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు చలసాని జగన్మోహనరావు, కొత్తూరు విఠల్, పరసా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వేడుకలను జరుపుకున్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వ హించారు. ముదినేపల్లి ఆర్‌సీఎం చర్చి పాదర్ మరియ దాసు, గాడ్స్ లవ్ మినిస్ట్రీ ఆధ్వర్యంలోని బెతెస్తా పెంతెకోస్తు చర్చిలో ఫాదర్ కటికల ప్రభుదాసు ఆధ్వర్యంలో, కొత్తపల్లిలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ జై రాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనలు జరిపి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

మండవల్లి : నూతన సంవత్సర వేడుకలను మండలంలో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. భైరవపట్నంలో ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా బాబిలకు మండలంలోని పలు గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు గ్రామపెద్దలు తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కలిదిండి : మండలంలో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకటా పురంలో ఏఎంసీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కూటమి నాయకులు న్యూ ఇయర్ కేక్ కట్ చేసి పంచారు. సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, కూటమి నాయకులు కురేళ్ల ఏడుకొండలు, నున్న కృష్ణబాబు, పేటేటి సత్యనారాయణ, దాసరి బెనర్జి, పరసా వెంకన్న, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మండవల్లి మండలం భైరవపట్నంలో చాపరాల దుర్గాప్రసాద్ సజ్జా బాబిలను సత్కరిస్తున్న దృశ్యం

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

మండవల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సింగనపూడిలో బుధవారం ఓ తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అమృతలూరి వీరభద్రరావు వడ్రంగి పనులు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య మృతి చెందగా ఇద్దరు కుమార్తెలు, కుమారుడికి వివాహమై గుడివాడ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వీరభద్రరావు ఇంట్లో ఉండగా మీటర్ వద్ద దట్టమైన పొగలు వస్తుండగా స్థానికులు వీరభద్రరావును అప్రమత్తం చేసి బయటకు తీసుకొచ్చారు. అనంతరం దట్టంగా మంటలు అలుముకోని ఇల్లు ఆహుతి అయింది. ప్రమాదంలో వడ్రంగి సామాగ్రి, టేకు కలప, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బీరువాలోని రూ.50 వేల నగదు ఇంటిలోని సామగ్రి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రూ.రెండు లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

కైకలూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కైకలూరులో సంతాన నాగేంద్రస్వామి ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం ఆలయం వద్ద కైకలూరు శ్యామలా గ్రూప్ మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్వామివారికి విశేషపూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు చావలి శంకరశాస్త్రి ఆధ్వర్యంలో అందజేశారు.



ఆలయం వద్ద మహిళల కోలాట ప్రదర్శన

ప్రవచన కర్త బసవయ్యకు సన్మానం

ముదినేపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పలు అవార్డుల గ్రహీత, అపర ఘంటసాల వెంకటేశ్వరరావుగా ప్రసిద్ధికెక్కిన ప్రవచనకర్త ఘంటసాల బసవయ్యను ముదినేపల్లి మండలం వడాలిలోని శ్రీ సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి దేవస్థానం తరఫున అధికారులు, అర్చకులు సన్మానించారు. ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 15 నుంచి నిత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న కలిదిండికి చెందిన బసవయ్యను బుధవారం ఆలయ ఈవో సింగన పల్లి శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు అగ్ని హోత్రం శ్రీనివాసా చార్యులు, అర్చకులు ఫణి కుమార్ ఆచార్యులు, గ్రామస్థులు సత్కరించారు.



ప్రవచనకర్త బసవయ్యను సత్కరిస్తున్న ఈవో శ్రీనివాసరావు

గడువు పొడిగింపు

కలిదిండి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువు డిసెంబరు 31వ తేదీతో గడువు ముగియడంతో జనవరి 7వ తేదీ వరకు పొడిగించినట్టు ఎంపీడీవో కొండలరావు బుధవారం తెలిపారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 11 వరకు అధికారులు నమోదు చేస్తారని, తుది కులగణన సర్వే వివరాలను జనవరి 17న గ్రామ సచివాలయాల వద్ద విడుదల చేస్తారన్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరి మృతి

ముదినేపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం తొలిరోజునే బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన విశ్వనాద్రిపాలెంలో విషాదం నింపింది. ఆ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నత్తా వెంకటేశ్వరరావు (59) మోపెడ్‌పై బొమ్మినంపాడు వెళ్తుండగా, ఈడేపల్లి రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనగా తలకు బలమైన గాయాలయ్యాయి. 108లో గుడివాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీఎస్.వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.







నూజివీడులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సారథి, ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు నేతల శుభాకాంక్షలు, గోపవరంలో కేక్ కట్ చేస్తున్న యువనేత గణేశ్

కొత్త సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలి : పార్థసారథి


నూజివీడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం ప్రజలంతా సంతోషంగా ఉండాలని మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జిల్లాను స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా అన్నిరంగాల్లో ప్రగతి పథంలో ఉంచేందుకు కృషిచేస్తామన్నారు. వ్యవసాయ, ఉద్యాన, విద్యా, వైద్య, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రంలో జిల్లాను ప్రథమస్థానంలో ఉంచుతానన్నారు. సబ్‌కలెక్టర్ బి.స్మరణరాజ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్‌భాష, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ జాన్‌మోషే, అధికారులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్: నూతన సంవత్సర వేడుకలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముద్దరబోయిన కేక్ కట్‌చేసి వేడుక ప్రారంభించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ముద్దరబోయినను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రజలకు నవశకాన్ని తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు.

● చాట్రాయి: మండలంలో టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు, అధికారులు నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బూరుగుగూడెంలో దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ హైమావతి దంపతులను, ఎంపీపీ లంకా నిర్మలను వైసీపీ శ్రేణులు, మండల స్థాయి అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● ముసునూరు: మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకులు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి 12గంటలకు ప్రధాన కూడళ్లలో యువకులు, మహిళలు, నాయకులు బాణసంచా కల్చి, కేక్‌లు కట్ చేశారు. గోపవరంలో టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేశ్ ఇంటివద్ద కేక్ కట్ చేశారు. ఆయనకు పలువురు పుష్పగుచ్ఛాలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ముసునూరు రైస్‌మిల్ సెంటర్‌లో గార్లపాటి నరసింహారావు ఆధ్వర్యంలో యువత న్యూఇయర్ కేక్‌ను కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేశారు. కొండేటి ఉదయ్‌కిరణ్, నక్కా యోహాను, తోట శ్రీను, రెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని చర్చిల్లో న్యూఇయర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో ఫాదర్లు, పాస్టర్లు కేక్‌లు కట్ చేసి, మిఠాయిలను పంపిణీ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ముసునూరు, కాట్రేనిపాడు, చెక్కపల్లి, రమణక్కపేట, గోపవరం తదితర గ్రామాల్లో ఆర్‌సీఎం చర్చి, బెరాక ప్రార్థన మందిరం, రక్షణ సైన్యం, సీఎస్ఐ చర్చిల్లో మత గురువులు న్యూఇయర్ సందేశాన్ని ఇచ్చారు. చర్చిల్లో అన్న సమారాధనలు జరిగాయి. సంఘ పెద్దలు, ఉపదేశకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

నూజివీడు టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు టీడీపీ నియోజకవర్గ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు ఘననివాళి అర్పించారు. నూజివీడులో ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రధానిగా దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. కాగా ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

యూటీఎఫ్ నూతన సంవత్సర 2025 డైరీని నియోజకవర్గ టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు బుధవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు బి.బాబురావు, చెన్నకేశవరావు, జి.వెంకటేశ్వరరావు, బత్తుల అనురాధ తదితరులు వేణుగోపాలరావును కలిసి శుభాకాంక్షలుతెలిపారు. యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతన సంవత్సర వేడుకలను నూతక్కి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

ట్రిపుల్‌ఐటీ ఆవరణలో భూగర్భ పైప్‌లైన్ ఏర్పాటు

నూజివీడు టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మురుగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించినట్లయింది. ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో ఎస్‌టీపీ వాటర్ డిస్‌పోజ్‌బుల్ సమస్య పరిష్కారానికి భూగర్భపైప్‌లైన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో పైప్‌లైన్ నిర్మాణానికి సంబంధించి వెల్‌కో ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్‌కు పనులు అప్పగించినట్లు నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణ్‌లు తెలిపారు.

స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

నూజివీడు టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు కోరారు. ఉపాధ్యాయుల పరిస్థితి మెరుగుపడిందని, ఈ పరిస్థితి పోరాటాలతోనే సాధ్యమైందన్నారు. ఈనెల 5నుంచి 8వ తేదీవరకు కాకినాడలో నిర్వహించతలపెట్టిన స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బత్తుల అనురాధ, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మూలమంత్ర జపయజ్ఞం

నూజివీడు టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక విశ్వగురువు గురు విశ్వస్ఫూర్తి మూల మంత్ర జపయజ్ఞాన్ని గురుపీఠంలో ఘనంగా నిర్వహించారు. ఓంకారం, గురుప్రార్థనలను స్ఫూర్తి కుటుంబ ప్రతినిధులు టీవీఎస్ ప్రసాద్, గుంటూరు కృష్ణ, కేవీ.రమేష్‌కృష్ణ, ఇరుకుళ్ళ రవికుమార్, లక్ష్మీకుమారి, ఆకుల భూదేవి, కుక్కడపు అనిల్ తదితరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ముసునూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులంపాడు, కాట్రేనిపాడు గ్రామాల్లో బుధవారం కోడిపందేల శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. ఆరుగురు పందెంరాయుళ్ళను అదుపులోకి తీసుకుని రెండు కోడిపుంజులు, రూ.2600 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

సారా విక్రయదారులపై కేసులు

నూజివీడు టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సారా విక్రయదారులు, అనధికార మద్యం విక్రయదారులపై 41 కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో 41 కేసులను నమోదు చేశామన్నారు.

ఇంటర్వ్యూ..



తమ్మిలేరు ప్రాజెక్టును ఆధునీకరించడం లక్ష్యం

యర్రా రమేశ్, అధ్యక్షుడు
తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ

● **తమ్మిలేరు ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి ఏమిటి?**

1978లో ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కట్టడాలు అన్ని శిధిలం అయ్యి, చివరి భూములకు నీరు అందక రైతులు నష్టపోతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు జైకా నిధులు రూ.16 కోట్లు మంజూరు కాగా వైసీపీ ప్రభుత్వం అరకొర పనులతో కాలం వెల్లబుచ్చింది.

● **జైకా నిధులతో చేపట్టబోయే పనులు ఏమిటి?**

సంఘాల అధ్యక్షులు అధికారులు సమన్వయంతో రాబోయే 25 ఏళ్ల వరకు ఇబ్బంది లేకుండా కాలువలు పూడికతీత, కల్వర్టులు, షట్టర్లు రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, జలాశయం తూములు మట్టికట్ట రెగ్యులేటర్ మరమ్మత్తులు చేపట్టి సకాలంలో పూర్తి చేయటానికి కృషి చేస్తాం.

● **ప్రస్తుతం ఏమి పనులు జరుగుతున్నాయి?**

కుడి కాలువలో రిటైనింగ్ వాల్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలో మధ్య కాలువ (మంకొల్లు), ఎడమ కాలువలలో కూడా పనులు మొదలు పెడతాం. మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

● **ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారు? నిధులు?**

వచ్చే వర్షాకాలంలోపు కాలువల మరమ్మతు పనులన్నీ పూర్తి చేయాలని ధ్యేయంగా పెట్టుకున్నాం. జలాశయం పనులు వేసవిలో చేపడతాం. నిధులు పుష్కలంగా ఉన్నాయి.

● **సంఘాలన్నీ ఏకగ్రీవం ఎలా అయ్యాయి?**

గత ప్రభుత్వం సాగునీటి వ్యవస్థను గాలి వదిలేయంటం వలన తీవ్ర నష్టం జరిగింది. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో రైతులందరూ రాజకీయాలకు అతీతంగా ఏకగ్రీవానికి సహకరించారు. రైతులు నమ్మకాన్ని నిలబెట్టుకుంటాము.

చాట్రాయి, ఆంధ్రజ్యోతి